నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 17 జూలై 2024 | HYDERABAD

## ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసం
**ఏపీకి చెందిన సైబర్ చీటర్ అరెస్ట్**

సిటీబ్యూరో, జూలై 16 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ఏపీకి చెందిన సైబర్‌నేరగాడిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్‌క్రైమ్స్ ఏసీపీ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన కీలారు సీతయ్య వృత్తిరీత్యా వ్యాపారి. తనకు తానుగా ఎరిక్‌సన్ గ్లోబల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సీనియర్ ఎంప్లాయీనంటూ చెప్పుకున్నాడు. నౌకరీ, లింక్‌డిన్ వెబ్‌సైట్ల నుంచి ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారి డేటాను సేకరిస్తాడు. వాళ్లకు ఫోన్ చేసి నేను ఫలానా కంపెనీలో పనిచేస్తున్నాను, అందులో ఉద్యోగం కావాలంటే మీకు ఇప్పిస్తాను.. కానీ కొంత ఖర్చవుతుందని నమ్మిస్తాడు. ఇతని మాటలు నమ్మి బాధితులు ముందుగా కొంత అడ్వాన్స్ ఇవ్వగానే ఫేక్ ఇంటర్వ్యూ నిర్వహించి, ఆ తరువాత ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్ పంపించి ఉద్యోగానికి ఎంపికయ్యావని మొత్తం డబ్బులు వసూలు చేస్తాడు. ఇలా పలువురికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి బాధితుల నుంచి రూ. 5.64 లక్షలు వసూలు చేశాడు. మోసపోయిన బాధితులు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడిపై సైబరాబాద్‌లో ఆరు, హైదరాబాద్‌లో ఒక కేసు నమోదైంది.

## డేటింగ్ యాప్‌తో మోసం

సిటీబ్యూరో, జూలై 16 (నమస్తే తెలంగాణ): డేటింగ్ యాప్‌లో పరిచయమై పెండ్లి పేరుతో మోసం చేస్తున్న సైబర్ నేరగాడిని సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్‌క్రైమ్స్ ఏసీపీ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, నంద్యాల జిల్లా సంజమాల మండలానికి చెందిన చిన్నిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి టిండర్, నీతూ డేటింగ్ యాప్‌లో సందీప్ సన్నీ పేరుతో నకిలీ యూజర్ ప్రొఫైల్‌తో ఖాతా తెరిచాడు. తన ఖాతా నుంచి పలువురికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించి.. తన ప్రొఫైల్‌లో గూగుల్ ఉద్యోగినని, యాప్ డెవెలపర్ అని చెప్పుకుంటాడు. అతడి ప్రొఫైల్ చూసి కొందరు ఫ్రెండ్‌షిప్ కోసం రిక్వెస్ట్ చేస్తారు. వాళ్లతో ముందుగా ఫ్రెండ్‌గా మాట్లాడి, తరువాత నిన్ను ప్రేమిస్తున్నాను, పెండ్లి చేసుకుంటానని నమ్మిస్తాడు. తరువాత తన కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో ఉన్నారని, అర్జెంట్‌గా డబ్బు అవసరమని.. కొంత డబ్బు సర్దితే మళ్లీ పంపిస్తానంటూ డబ్బులు లాగేస్తాడు. ఇలా సేకరించిన డబ్బును బెట్టింగ్, గేమింగ్ యాప్‌లలో పెట్టి జల్సా చేస్తాడు. అనంతరం వారిని నెమ్మదిగా దూరం పెడతాడు. ఈ క్రమంలో ఓ బాధితురాలు తనను నమ్మించి రూ. 6,41,736 లు మోసం చేశాడని, పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్ నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసింది.


KTR @KTRBRS · 39m
Request @CommissionrGHMC to respond at the earliest and do the needful

If we don't get a response within 48 hours, we along with local citizens will be compelled to launch a "Shrama Danam" program and do it ourselves

Sumanth @sumanth_0193 · 50m
@KTRBRS "Urgent issue: Our colony, with 50 families and children, faces snake threats due to overgrown trees. Despite complaints, GHMC & the Mayor @gadwalvijayainc are unresponsive. We also lack drinking water and proper roads, with no night security and frequent robberies.

## సమస్యపై ఫిర్యాదు చేస్తే మేయర్ పట్టించుకుంటలేదు
**కేటీఆర్‌కు నెటిజన్ ట్వీట్**

**సమస్యలు పరిష్కరించని జీహెచ్‌ఎంసీ తీరుపై కేటీఆర్ ఆగ్రహం**



సిటీబ్యూరో, జూలై 16 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ ప్రజలు తమ కాలనీల్లో సమస్యలున్నాయంటూ ఎన్ని ఫిర్యాదులు చేసినా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే సమస్యను పరిష్కరించే విషయంలో జీహెచ్‌ఎంసీ ఎందుకు విఫలమవుతుందని ప్రశ్నించారు. నాగోల్ బండ్లగూడలోని అరుంధతీ ఎన్‌క్లేవ్‌లో బల్దియా నిర్లక్ష్యం కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు ఎక్స్ ద్వారా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. తమ కాలనీల్లో చెట్లు భారీగా పెరగడం, చెత్తాచెదారం కారణంగా పాముల బెడద ఉందని జీహెచ్‌ఎంసీ మేయర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఓ వ్యక్తి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా తెలిపారు. తమ కాలనీలో 50 కుటుంబాలున్నాయని, సరైన రోడ్లు, నీటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. రాత్రి అయితే.. దొంగతనాలు జరుగుతున్నాయని కేటీఆర్‌కు వివరించాడు. ఈ ట్వీట్‌పై కేటీఆర్ స్పందించారు. ఆ నెటిజన్ ఫిర్యాదుపై స్పందించి సమస్యను పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏ సమస్య ఉన్నా సరే ఒక్క ట్వీట్ చేస్తే ఆ సమస్యను పరిష్కరించే వాళ్లమని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కార్పొరేటర్ల పార్టీ ఫిరాయింపులపై మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టడంతో ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఇకపై ప్రజా సమస్యలపై మేయర్ సహ ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. 48 గంటల్లో సమస్య పరిష్కారం కాకపోతే స్థానికులతో కలిసి తామే శ్రమదానం చేసుకొని సమస్యను పరిష్కరించుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు.



ప్రొటోకాల్ విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, పద్మారావు గౌడ్, ప్రశాంత్ రెడ్డి, సునీతా రెడ్డి, వివేకానంద్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, సంజయ్, ప్రభాకర్ తదితరులు

**కాంగ్రెస్ భరతం పడతం**

# పజ్జన్నను పిలువరా?
## అమ్మవారి ఆలయాల చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ రగడ

**ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం**

**నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు**

సికింద్రాబాద్, జూలై 16 : సికింద్రాబాద్‌లో బోనాల జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాల చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. శాంతి యుత వాతావరణం నుంచి చిలికి చిలికి గాలి వానయింది. దీనంతటికి కారణం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రొటోకాల్ పాటించడం లేదని.. స్థానిక సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్‌ను చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానించలేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలపాలనుకున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్లను పోలీసులతో పాటు కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఓ క్రమంలో తోపులాట వరకు వెళ్లింది. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే ఉండటంతో దీంతో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసనకు తరలివచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఆందోళన చేపడతారన్న ముందస్తు సమాచారంతో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న సీతాఫల్‌మండి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను కూడా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. లోపలికి వచ్చే గేటును మూసివేసి, వాహనాలను లోపలికి అనుమతించలేదని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. ఎక్కడ చూసినా కాంగ్రెస్ పార్టీ నాయకుల బ్యానర్లేనని, వారి ఫొటోలే దర్శనమిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎందుకు ఆహ్వానించలేదని బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్‌లు హేమ, కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మితో పాటు నాయకులు ఆలకుంట హరి, పాక సాయి, వనమాల భాస్కర్, బెజ్జెంకి రాజేశ్, కంది నారాయణ, శ్రీనివాస్‌లు.. సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్‌ను అడ్డుకుని నిలదీశారు. దీంతో ఒక్కసారిగా ఇరువర్గాల నాయకులు ఒకరినొకరు తోసుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు ఇరు వర్గాలను శాంతింపజేశారు. అయినా పట్టు వీడని బీఆర్‌ఎస్ నాయకులు , కార్పొరేటర్లు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. స్టేజీపై ఉన్న కాంగ్రెస్ పార్టీ బ్యానర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎక్కడ కూడా తమ ఎమ్మెల్యే పద్మారావు ఫొటో లేదని ఏం ప్రొటోకాల్ పాటిస్తున్నారని ప్రశ్నించారు. కాగా స్టేజీ పైఉన్న బ్యానర్‌ను తొలగించాలని బీఆర్‌ఎస్ నాయకులు పట్టుబట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం పద్మారావుకు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వచ్చే దాకా ఆపాలని డిమాండ్ చేశారు. తీవ్ర ఘర్షణల మధ్య పోలీసుల పహారాలో ఎట్టకేలకు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఆలయాల చెక్కులను నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు హేమ, సునీత, శైలజ, ప్రసన్నలక్ష్మితో కలిసి పంపిణీ చేశారు.



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్‌ను నిలదీస్తున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు

### బీఆర్‌ఎస్ నేతల అరెస్టు..

సికింద్రాబాద్ బోనాల జాతర ఆలయాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. వారందరిని డీసీఎంలో చిలకలగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

## 'సమస్యలపై శంఖారావం'



*ఎర్రగడ్డ, జూలై 16: బోరబండలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమస్యలపై శంఖారావం' కార్యక్రమానికి మంగళవారం విశేష స్పందన లభించింది. సైట్-3లోని ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీహాలులో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజల సమస్యలు ఎమ్మెల్యే మాగంటి విన్నారు. అనంతరం ప్రజలు వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. రెవెన్యూ, బల్దియా, జలమండలి, పౌరసరఫరాలు, ఎలక్ట్రికల్ తదితర శాఖలకు అనుబంధంగా ఉన్న అంశాలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. వివిధ శాఖల అధికారులు కిరణ్, రామచంద్రరాజు, గిరిధర్, సరస్వతి, వేణు తదితరులు హాజరై ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే మాగంటి సూచించారు.*

# నాగోల్‌లో అతిపెద్ద ఎస్టీపీ

**ఎస్‌బీఆర్ టెక్నాలజీతో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం**

**రూ. 800 కోట్లతో 320 ఎంఎల్‌డీ సామర్థ్యంతో..**

**కేసీఆర్ ప్రభుత్వంలో పురుడుపోసుకొని అందుబాటులోకి**

**రెండు రోజుల క్రితం ట్రయల్ రన్ పూర్తి.. త్వరలో ప్రారంభం**

**రికార్డు సమయంలో ఎస్టీపీని పూర్తి చేసిన రాంకీ సంస్థ**

సిటీబ్యూరో, జూలై 16 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న ప్రాజెక్టులో మరో భారీ మురుగునీటి ప్రాజెక్టు అందుబాటులోకి రాబోతున్నది. దేశంలోనే వందకు వంద శాతం మురుగునీటి శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను నిలపాలన్న కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యంతో అద్భుతమైన టెక్నాలజీతో ఎస్టీపీల నిర్మాణం జరిగింది. రోజూ ఉత్పన్నమయ్యే మురుగునీటిని వంద శాతం శుద్ధి చేయడానికి వీలుగా రూ. 3866.41 కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్‌డీల సామర్థ్యంతో 31 కొత్త ఎస్టీపీలను చేపట్టి ఏడు చోట్ల వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే నాగోల్‌లో 320 ఎంఎల్‌డీ సామర్థ్యంతో సీక్వెన్షియల్ బ్యాచ్ రియాక్టర్ (ఎస్‌బీఆర్) సాంకేతికతతో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రం భారతదేశంలోనే అతి పెద్దది కావడం విశేషం. ఇప్పటి వరకు యుఏఎస్‌బీఆర్ టెక్నాలజీ, ఎంబీబీఆర్ టెక్నాలజీ కంటే కొత్తగా, అందులో ఎస్‌బీఆర్ టెక్నాలజీతో భారీ ఎస్టీపీ నిర్మాణం ఇదేనని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఎస్‌బీఆర్ టెక్నాలజీలో చిన్న ఎస్టీపీలు మాత్రమే ఇప్పటి వరకు ఉన్నాయి. 320 ఎంఎల్‌డీ సామర్థ్యంతో దాదాపు 800 కోట్ల వ్యయంతో.. 24 నెలల్లో పూర్తి కావాల్సిన ఈ ఎస్టీపీని 16 నెలల్లోనే పూర్తి చేసి..రెండు రోజుల క్రితం ట్రయల్ రన్ ప్రారంభించారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ప్రాజెక్టు విభాగం అధికారుల నిరంతర పర్యవేక్షణలో నిర్ణీత సమయంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. కాగా సదరు నిర్మాణ సంస్థ 15 ఏండ్ల నిర్వహణకుగానూ రూ. 400కోట్లు ఖర్చు చేయనుంది.

**సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో నిర్మాణం..**

అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో ఎస్టీపీల నిర్మాణం జరిగింది. మెట్రో నగరాల్లో స్థలాభావం కారణంగా ఎస్‌బీఆర్ టెక్నాలజీతో నిర్మాణం అనువుగా ఉంటుంది. వీటి వల్ల ఒకే చాంబర్‌లో ఐదు స్టేజీల మురుగునీటి శుద్ధి ప్రక్రియ జరిగి.. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నీటిని శుద్ధి చేస్తాయి. దేశంలో వినియోగిస్తున్న వివిధ బయోలాజికల్ ట్రీట్‌మెంట్ పద్ధతుల కంటే ఈ ఎస్‌బీఆర్ విధానానికి తక్కువ ఖర్చు అవడంతో పాటు మెరుగ్గా మురుగునీటి శుద్ధి జరుగుతుంది. ఇది తేలికైన విధానం. దీనికి విద్యుత్తు వినియోగం కూడా తక్కువ. యుఏఎస్‌బీఆర్ టెక్నాలజీ, ఎంబీబీఆర్ టెక్నాలజీ కంటే ఎస్‌బీఆర్ టెక్నాలజీతో అద్భుతమైన ఫలితాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. మూడు గంటల వ్యవధిలోనే మూడు విడతల్లో మురుగునీటి శుద్ధి జరిగి, తాగేందుకు తప్పా నిర్మాణ రంగానికి, పార్కులు, వాహనాల వాషింగ్, ఇతర అవసరాలకు ఈ వాటర్‌ను వినియోగించవచ్చు. నిరంతరం స్కాడా విధానంలో పర్యవేక్షణ, అధునాతన శుద్ధి విధానం ఎస్‌బీఆర్ సొంతం అని అధికారులు చెబుతున్నారు.


### ప్రాజెక్టు విశేషాలు

- 320 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 15 ఎకరాల్లో ఎస్టీపీ నిర్మాణం
- 24 నెలల్లోనే నిర్మాణం పూర్తి.
- ప్రాజెక్టు వ్యయం రూ. 800కోట్లు, 15 సంవత్సరాల నిర్వహణకు రూ. 400 కోట్లు
- హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్‌ఏఎం) పద్ధతిలో నిర్మాణం
- 40శాతం ప్రభుత్వ వాటా, 60 శాతం రాంకీ ఏజెన్సీ
- మురుగునీటి సమస్య తొలిగే ప్రాంతాలు : సైదాబాద్, మలక్‌పేట్, యాకుత్‌పుర, ఎల్బీనగర్, గడ్డి అన్నారం, సరూర్‌నగర్, నాగోల్, లింగోజిగూడ, రాఘవేంద్ర నగర్, నాగోల్, మూసారంబాగ్ ట్రంక్ సివర్ మెయిన్ ప్రాంతాలకు ప్రయోజనం ఉంటుంది.

### మురుగునీటి శుద్ధి విధానంలో బెస్ట్ టెక్నాలజీ

మూసీ నది పునర్జీవమే లక్ష్యంగా.. దక్షిణ భాగాన ఐదు ఎస్టీపీల నిర్మాణ బాధ్యతలను తీసుకున్నాం. 480.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నాలుగు ప్రాంతాల్లో 5 ఎస్టీపీల నిర్మాణానికి గానూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా దేశవ్యాప్తంగా 70 ఎస్టీపీల నిర్మాణాలు చేపట్టిన అనుభవం మా సంస్థకు ఉంది. మురుగు ముంపుతో క్షీణిస్తున్న మూసీ నదిని పునరుద్ధరణలో తాము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. ఎస్‌బీఆర్ టెక్నాలజీతో విద్యుత్ వినియోగం తక్కువ. పర్యావరణ ప్రభావాన్ని సైతం తగ్గిస్తుంది. ఇప్పటికే కోకాపేటలో 15 మిలియన్ లీటర్ల శుద్ధి కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చాం. నాగోల్‌లో 170 ఎంఎల్‌డీ, ఇక్కడే 320 ఎంఎల్‌డీ ఎస్టీపీని తీసుకువస్తున్నాం. త్వరలో మిరాలం వద్ద ఎస్టీపీని అందుబాటులోకి తీసుకొస్తాం.

**- ఎన్ఎస్ రావు, పి.రవి ప్రసాద్, రాంకీ సంస్థ ప్రతినిధులు**




# మూసీ మురిసేనా?

**అసాధ్యంగా మారిన తొలగింపుల ప్రక్రియ**

**12వేలకు పైగా అక్రమ నిర్మాణాలు**

**ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటన**



సిటీబ్యూరో, జూలై 16 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు ఆక్రమణలు కంటిలో నలుసులా మారాయి. దాదాపు 50 కిలోమీటర్ల మేర ప్రవహించే మూసీ పరివాహక ప్రాంతాలకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు, అనధికారిక భవనాలు, అనుమతుల్లేని పరిశ్రమలు వెలిశాయి. గత ప్రభుత్వానికి ధీటుగా మూసీ పరివాహక ప్రాంతాన్ని సరికొత్త నగరంగా తీర్చిదిద్దుతామంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మూసీ వెంట సుమారు 12వేల అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు... ప్రత్యేక నివేదిక రూపొందించారు. డీపీఆర్‌కు అనుగుణంగా గండిపేట్ నుంచి గౌరవెల్లి వరకు అన్ని విభాగాల అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు సేకరిస్తోంది. ఈ క్రమంలో ఎప్పటికప్పుడూ వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తుండగా, మూసీ వెంట ఉన్న మండలాల్లో 12వేల ఆక్రమణలు ఉన్నాయని ప్రాథమికంగా తేల్చారు. మూసీ సుందరీకరణ పేరిట ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నా... అమలుకు ఈ ఆక్రమణలు అన్నీ కూడా ఆటంకంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే అధికారుల బృందం చేసిన సర్వేలోనూ ఇదే విషయం వెల్లడైంది. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూసీకి ఇరువైపుల ఉన్న పరివాహక ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలు, ఓపెన్ ల్యాండ్, బఫర్ జోన్ పరిధిలో ఉండే ఆక్రమణలను తేల్చేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తోంది. వాటర్ బోర్డు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ఎంఆర్‌డీసీఎల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారుల బృందం మూసీ వెంబడి పర్యటించి ఆక్రమణలు, నిర్మాణాలను గుర్తించింది. గడిచిన మూడు నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతుండగా.. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ అధికారులు నివేదిక రూపొందిస్తున్నారు. ఇప్పటిరకు గుర్తించిన నిర్మాణాలు, ఆక్రమణలను ఏ విధంగా తొలగిస్తారు? వారందరికీ ఎలా పరిహారం అందిస్తారన్న అంశం మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు అడ్డంకిగా మారేలా ఉంది. అయితే ఇప్పటివరకు సర్వేలో స్థానికుల వివరాలను కూడా నమోదు చేస్తుండగా, నిర్వాసితులకు ఏ విధంగా న్యాయం చేస్తుందనే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు సర్వే చేస్తున్న అధికారులు కూడా తమకు ఆ విషయంలో ఎలాంటి సమాచారం లేదంటున్నారు.

### బొందల గడ్డలు, కమర్షియల్ భవనాలు

మూసీ వెంట ఇప్పటివరకు జరిగిన సర్వేలో శ్మశాన వాటికలతోపాటు, కమర్షియల్ భవనాలు, బఫర్ జోన్‌లో నివాసిత ప్రాంతాలు ఉన్నాయని తేల్చారు. పట్టా భూములు, వక్ఫ్, ఇనాం, ప్రైవేటు, ప్రభుత్వ భూములతోపాటు, దేవాదాయ, ఇతర భూముల వివరాలను నమోదు చేస్తున్నారు. దీంతోపాటు, అయితే ఉన్న నిర్మాణాల్లోనూ పక్కా గృహాలా? ఎన్ని అంతస్తుల్లో భవనాన్ని నిర్మించారు. ఎంత మంది నివాసం ఉంటున్నారనే విషయాలను కూడా సర్వేలో పొందుపరిచారు. దీంతోపాటు బిల్డింగ్ ఎప్పుడూ నిర్మించారు? ప్రస్తుత పరిస్థితి ఏవిధంగా ఉందనే అంశంతోపాటు, ఆయా భవనాల్లో నివాసం ఉండే వారి జీవన, ఆర్థిక స్థితిగతులను కూడా సర్వేలో పొందుపరిచినట్లుగా తెలిసింది.